క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రఘునాథపాలెం/ఖమ్మంఅర్బన్: రోడ్డు విస్తరణ పనులు, సబ్ స్టేషన్ లైన్ల మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈలు ఎ.ఇందిర, భాస్కర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. రఘునాథపాలెం పీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రఘునాథపాలెం, కేసీఆర్ కాలనీ, కేటీఆర్ కాలనీ, కోయచలక, రేగులచలక, ప్రగతిపైడ్, రఘునాథపాలెం పైకాలనీ, దారేడు, శివాయిగూడెం, పువ్వాడ నగర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే నగరంలోని పారిశ్రామిక ప్రాంతలోని సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పారిశ్రామిక ప్రాంతం, జయనగర్ కాలనీ, బల్లేపల్లి, బాలపేట, పాండురంగాపురం, అమరావతినగర్, విద్యానగర్, కైకొండాయిగూడెం, గణేశ్ టౌన్‌షిప్, యూపీహెచ్ కాలనీ, బాలాజీనగర్, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

జిన్నింగ్ మిల్లుకు మూడు రోజుల సెలవు

నేలకొండపల్లి: ముదిగొండ మండలం సువర్ణపురంలోని ఉష శ్రీ జిన్నింగ్ మిల్లు కేంద్రం నేటి (శనివారం) నుంచి సోమవారం వరకు సెలవులు ప్రకటిస్తున్నట్లు నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఆర్.సంతోశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 11న రెండో శనివారం, 12న ఆదివారం, 13న దీపావళి పండుగ కావడంతో సీసీఐ కొనుగోలు కేంద్రానికి సెలవులు ప్రకటించారని, తిరిగి మంగళవారం కొనుగోళ్లు జరుగుతాయని పేర్కొన్నారు.

గురుకులాన్ని పరిశీలించిన ప్రత్యేక బృందం



గురుకులంలో ప్రతినిధి బృందం సమీక్ష

నేలకొండపల్లి: మండలంలోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ప్రత్యేక బృందం శుక్రవారం పరిశీలించింది. జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర్‌శర్మ ఆదేశాల మేరకు మొత్తం 8 మందితో కూడిన బృందం రోజంతా తనిఖీలు చేపట్టడంతో పాటు ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులను వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నాక ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈమేరకు సేకరించిన నివేదికను డీఈఓకు అందించనున్నట్లు హెచ్‌ఎం ప్రధానోపాధ్యాయుడు గోపగాని రమేశ్ తెలిపారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ సమావేశం



మాట్లాడుతున్న కమాండర్ అభిజిత్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియా నేవీ లెఫ్టినెంట్ కమాండర్ బిక్కుమళ్ల అభిజిత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఇంటర్మీడియట్ విద్యార్థినులు భారతసాయుధ త్రివిధ దళాల్లో ఉద్యోగాలు సాధించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బిక్కుమళ్ల అరుణ్‌కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

నేలకొండపల్లి: యాసంగిలో రైతులు అనువైన పంటలు సాగు చేసుకోవాలని కూసుమంచి ఏడీఏ ఎస్.విజయచంద్ర సూచించారు. శుక్రవారం మండలంలోని మంగ్రాజుపల్లి రైతు వేదికలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించాక అపరాల పంటలు, పురుగులు, తెగుళ్ల తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో నేలకొండపల్లి ఏఓ అరుణకుమారి, ఏఈఓ బి.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	జపాన్, జిగర్‌తండా డబుల్ ఎక్స్
వినోద	భగవంత్ కేసరి
సాయిరాం	జపాన్
ఆదిత్య	మా ఊరి పొలిమేర 2
శ్రీనివాస	జిగర్‌తండా డబుల్ ఎక్స్

- ఖమ్మం గాంధీచౌక్

ముగిసిన నామినేషన్ల స్వీకరణ..

- చివరి రోజు ఖమ్మంలో 26, పాలేరులో 22 దాఖలు
- నేటి నుంచి పరిశీలన



ఖమ్మంరూరల్: నామినేషన్ దాఖలు చేస్తున్న బీఎస్పీ అభ్యర్థి అల్లిక వెంకటేశ్వర్లు

ఖమ్మంమయూరిసెంటర్/ ఖమ్మంరూరల్: ఈ నెల 30న జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. చివరిరోజు శుక్రవారం ఖమ్మం నియోజకవర్గంలో 26మంది అభ్యర్థులు 28 సెట్ల నామినేషన్ల పత్రాలను ఖమ్మం ఆర్‌ఓ ఆదర్శ్ సురభికి, పాలేరు నియోజకవర్గంలో 19మంది అభ్యర్థులు 22 సెట్ల నామినేషన్లను ఆర్‌ఓ రాజేశ్వరికి అందజేశారు. ఈనెప థ్యాన 3వ తేదీ నుంచి మొదలై మొత్తం 7 రోజుల పాటు జరిగిన ఈ ప్రక్రియలో ఖమ్మంలో 39 మంది అభ్యర్థుల నుంచి 59 సెట్ల నామినేషన్లు, పాలేరులో 40 మంది అభ్యర్థుల నుంచి 59 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల నామినేషన్లను నేటి నుంచి 3వ తేదీ వరకు అధికారులు పరిశీలించనున్నారు. కాగా, ఖమ్మంలో చివరిరోజు బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ 3 సెట్లు, జనసేన అభ్యర్థి మిర్యాల రామకృష్ణ, సీపీఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్, బహుజన రిపబ్లికన్ సోషలిస్ట్ పార్టీ అభ్యర్థి బత్తుల నగేశ్, యుగ తులసి పార్టీ అభ్యర్థి వికాస్ మందడపు, బహుజన లెఫ్ట్ పార్టీ అభ్యర్థి మిట్టకోల దినేశ్, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి సునీల్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) అభ్యర్థి శభ్నం, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి శ్రీనివాసరావు ఐతగాని, ఇండియన్ బిలీవర్స్ పార్టీ అభ్యర్థి రామల స్వరూప, దళిత బహుజన పార్టీ అభ్యర్థి రొడ్డ శివయ్య, స్వతంత్ర అభ్యర్థులుగా యల్లంకి కోటయ్య రెండో సెట్, గుంటి నాగరాజు, ముత్యం అర్జున రాజు, గుర్రం సత్యనారాయణ, కొమ్ము రమేశ్, నకిరికంటి సురేష్‌కుమార్, పలిమల మురళి, బానోత్ ప్రసాద్, కుక్కల అజయ్ హర్షిక్, షేక్ జమీల్, అజయ్‌కుమార్ అన్నబత్తుల, గంగుల పుల్లారావు, సీమ రాంబాబు, గుడికందుల సత్యనారాయణలు నామినేషన్లను దాఖలు చేశారు. అలాగే పాలేరులో బీఆర్ఎస్ నుంచి కందాళ ఉపేందర్‌రెడ్డి తరఫున ఆయన అనుచరులు ఒకటి, ఇండిపెండెంట్‌లుగా కందాళ విజయ, రామసహాయం మాధవిరెడ్డి, భారతీయ స్వదేశీ కాంగ్రెస్ నుంచి తేజావత్, బాలక్రిష్ణ, బీజేపీ నుంచి నున్నా రవికుమార్, పిరమిడ్ పార్టీ నుంచి హలావత్ రామారావు, ఇండిపెండెంట్లుగా అన్నాబత్తుల శ్రీనివాస్, అనుగంటి నాగరాణి, గద్దం వీరబాబు, పసుమర్తి శ్రీనివాస్, బారి అశోక్, గోపోజు రమేష్, భూక్యా పార్వతి, బీఎస్పీ నుంచి అల్లిక వెంకటేశ్వర్లు, దళిత బహుజన్ పార్టీ నుంచి కొమ్మా ప్రసాద్, సీపీఎం నుంచి తమ్మినేని వీరభద్రం, ప్రజావాణి పార్టీ నుంచి దూలం వెంకటనారాయణ, మన టీఆర్ఎస్ పార్టీ నుంచి పంబా సత్యనారాయణ, మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(యునైటెడ్) నుంచి కాంపాటి వెంకటేశ్వర్లు నామినేషన్‌లు దాఖలు చేశారు.

సాదుకుంటారా.. సంపుకుంటారా..?

ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్



రఘునాథపాలెం: కేవీ బంజరలో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్

రఘునాథపాలెం/ఖమ్మమయూరిసెంటర్: ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధిని సాదుకుంటారా.. సంపుకుంటారా అని ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నామినేషన్ అనంతరం తొలి ప్రచారాన్ని రఘునాథపాలెం మండలం కేవీబంజర గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించడంతో పాటు నగరంలోని 19, 44వ డివిజన్, రఘునాథపాలెం మండలం వీవీ పాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖమ్మంలో ఒక పెద్ద మనిషి ఇక్కడ జరిగిన అభివృద్ధి అంతా తానే చేసానని చెప్పుకుంటున్నారని, రానురాను ఇంకా ఏం చెప్తాడో కూడా అర్థం కావడం లేదని, ఖమ్మం ఖిల్లా కూడా తానే కట్టానని చెప్తాడేమో అని పువ్వాడ ఎద్దేవా చేశారు. తాను ఖమ్మంలో పుట్టి పెరిగాను కాబట్టి ఇక్కడ అభివృద్ధి చేయాలనే కసి, తపన తనకు ఉందని, అది వేరే వారికి లేదని అన్నారు. నిసిగ్గుగా పదవి వ్యామోహంతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. ప్రతీ గ్రామంలో మట్టి రోడ్లు లేకుండా అన్ని సీసీ రోడ్లుగా మార్చానని గుర్తు చేశారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి మీ గ్రామాలను మీరే పరిపాలించే విధంగా చేశామని, తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా అయిన తర్వాతనే ఈ అభివృద్ధి అంతా జరిగిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు ఓటు వేసి ఈ అభివృద్ధిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ కూరాకల నాగభూషణం, జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక, వైస్ ఎంపీపీ గుత్తా రవి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు మాదంశెట్టి హరిప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, వైస్ చైర్మన్ ఆఫ్జల్, ఆత్మ చైర్మన్ భూక్యా లక్ష్మణ్‌నాయక్, నాయకులు మద్దినేని వెంకటరమణ, కుర్రా భాస్కరరావు, మందడపు నర్సింహారావు, మందడపు సుధాకర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆజ్మీరా వీరునాయక్, కుతుంబాక నరేష్, దానయ్య, నాగయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

డబ్బు, అహకారంతో గెలవలేరు...

- ఎన్ని దాడులు చేసినా భయపడేది లేదు
- పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: అధికార అహం, డబ్బు బలంతో ఏదైనా చేయొచ్చని, మళ్లీ అధికారంలోకి రావొచ్చని బీఆర్ఎస్ నేతలు అనుకుంటున్నా.. ఆ కలలను కల్లలు చేయడానికి ప్రజలు సిద్ధమయ్యారని పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం జరిగిన ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. గత తొమ్మిదిన్నరేళ్లుగా ప్రజలకు ఏమీ చేయకుండా ఇప్పుడు మళ్లీ మాయ మాటలతో బీఆర్ఎస్ నేతలు వచ్చారని ఆరోపించారు. ప్రజలు ఓడించేందుకు సిద్ధమయ్యారని గుర్తించిన బీఆర్ఎస్ నేతలు... అర్థంపర్థంలేని మాటలు మాట్లాడుతున్నారని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాల ప్రతిపాదికన తెలంగాణను సాధించుకుంటే అన్నివర్గాల ప్రజలు మోసపోయారని తెలిపారు. కాగా, కాంగ్రెస్ కార్యకర్తలెవరూ అభద్రతకు గురికావద్దని, తనపై జరిగిన ఐటీ దాడులు బీఆర్ఎస్, బీజేపీ కుట్ర అని చెప్పారు. రాబోయే ఇందిరమ్మ రాజ్యమే అయినందున అందరికీ న్యాయం జరుగుతుందని పొంగులేటి తెలిపారు.

30 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక..

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బీఆర్ఎస్‌కు చెందిన 30 కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేశాయి. శుక్రవారం పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షాన వారు కాంగ్రెస్‌లో చేరగా, కండువా కప్పి ఆహ్వానించారు. పాలేరులో భారీ మెజార్టీ వచ్చేలా సైనికుల్లా పని చేయాలని, పార్టీలో అందరికీ సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమాల్లో నాయకులు రాయల నాగేశ్వరరావు, మద్ది వీరారెడ్డి, బాలసాని లక్ష్మీనారాయణ, మద్దినేని రాంరెడ్డి, చరణ్‌రెడ్డి, బేబీ స్వర్ణకుమారి, పంతులునాయక్, బత్తుల కూర్మారావు, కస్నేటి వెంకన్న, మల్లారెడ్డి, బోడా వెంకన్న, మైశా శంకర్, కొడాలి గోవిందరావు, నిమ్మగడ్డ నగేష్, శ్రీనాథ్, పి.రాంభాస్కర్‌గౌడ్, యడవల్లి హుస్సేన్‌గౌడ్, మద్రి శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథాకు సీపీఎం క్షమాపణ చెప్పాలి

తిరుమలాయపాలెం: సీపీఎం పాలేరు నియోజకవర్గ అభ్యర్థిగా తమ్మినేని వీరభద్రం నామినేషన్ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో సీపీఎం కేంద్ర కమిటీ పోలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథాపై చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని, వెంటనే ప్రజాపంథాకు క్షమాపణ చెప్పాలని ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని బచ్చోడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎంను బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకించిన తర్వాత కాంగ్రెస్ పార్టీతో బేరసారాలాడి కాంగ్రెస్ మాకు అన్యాయం చేసిందని మాట్లాడిన వారు ఈరోజు ప్రజాపంథాపై మాట్లాడే హక్కు లేదని అన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, డివిజన్ నాయకులు ఎడ్లపల్లి నవీన్, శంకర్, తిమ్మిడి హనుమంతరావు, గోకినపల్లి సరోజిని, భారతమ్మ, వెన్న బోయిన శ్రీనివాసరావు, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడే నాయకుడిని గెలిపించండి

ఖమ్మంమయూరిసెంటర్: నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే ఖమ్మం నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్‌ని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు జె.వెంకటేశ్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయం నుంచి ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి ప్రచార వాహనాలను వెంకటేశ్, అసెంబ్లీ అభ్యర్థి యర్రా శ్రీకాంత్, జిల్లా నాయకుడు వై.విక్రమ్‌లు జెండా ఊపి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూడ శోభన్, సీపీఎం జిల్లా నాయకులు మెరుగు సత్యనారాయణ, నందిపాటి మనోహర్, తుమ్మ విష్ణు, షేక్ మీరా, వై.శ్రీనివాసరావు, పిన్నింటి రమ్య, చింతల రమేష్, షేక్.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

కామేపల్లి: కారు ఢీకొని ఓ వ్యక్తికి స్వల్ప గాయాలైన సంఘటన శుక్రవారం కామేపల్లి క్రాస్ రోడ్డులో చోటు చేసుకుంది. కామేపల్లి గ్రామానికి చెందిన చిలుమల శ్రీకాంత్ ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారి పక్కన నడుచుకుంటూ కామేపల్లి క్రాస్ రోడ్డు వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో శ్రీకాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

నివాళి..

కామేపల్లి: మద్దులపల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మందుల ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందడంతో శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బానోత్ హరిసింగ్‌నాయక్ బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధరావత్ రవీందర్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు ధనియాకుల హన్మంతరావు, సామా మోహన్‌రెడ్డి, తీర్దాల చిదంబరరావు, అంతోటి అచ్చయ్య, కీసర విష్ణువర్ధన్‌రెడ్డి నివాళులర్పించారు.

కాంగ్రెస్ నాయకుడి మృతికి..

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిప్పలపల్లి ముత్తయ్య(50) గుండుపోటుతో శుక్రవారం మృతి చెందగా.. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, సర్పంచ్ లకావత్ సునీత, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, ఉపసర్పంచ్ పుచ్చకాయల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాలేరు ప్రజల సంక్షేమమే ధ్యేయం

పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి



ఖమ్మంరూరల్: తెల్దారుపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం: పాలేరు ప్రజల క్షేమం, సంక్షేమమే తనకు ముఖ్యమని, గ్రామాల్లో ఎలాంటి గొడవలు లేకుండా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలనేదే ధ్యేయమని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఖమ్మంరూరల్ మండలంలోని తెల్దారుపల్లి, పొన్నేకల్, తల్లంపాడు, మద్దులపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో కందాళ మాట్లాడారు. గత పదేళ్లుగా సీఎం కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన హామీలన్నీ నెరవేరుస్తామని తెలిపారు. ఇంతకాలం తన దగ్గరకు వచ్చిన ప్రతీ ఒక్కరికి పార్టీలతో సంబంధం లేకుండా చేతనైనంత సాయం చేశానని తెలిపారు. మీఅందరికీ అందుబాటులో ఉండే తనను మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని తెలిపారు. కాగా, వరంగల్‌క్రాస్‌రోడ్‌కు చెందిన మసీదు నిర్వాహకులు కందాళకు మద్దతు తెలిపారు. అదేవిధంగా పాలేరు ఎమ్మెల్యేగా ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకున్న కందాళ ఉపేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే కుమార్తె దీప్తి శుక్రవారం తిరుమలాయపాలెం మండలం మేడిదపల్లిలో ఇంటింటికి తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. ఈకార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ గుడిబోయిన దరగయ్య, శంకర్, తాటికొండ సుదర్శన్, పార్టీ మండల అధ్యక్షులు వీరన్న, బాలు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పలువురి చేరిక..

ఖమ్మంరూరల్ మండలం నడిమితండాకు చెందిన 50కుటుంబాలు, రామన్నపేటకు చెందిన 14 కుటుంబాలు, నాయుడుపేటకు చెందిన 20 కుటుంబాలు, తిరుమలాయపాలెం మండలంలోని బీసురాజుపల్లి తండా, హలావత్‌తండాకు చెందిన పలు కుటుంబాలు ఎమ్మెల్యే కందాళ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి బీఆర్ఎస్ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రూపు బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన ఎరుపాలెం మండలం పెగళ్లపాడుకు చెందిన నిరుపేద సగ్గుర్తి గణేశ్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం జాంబవ వారసుల గ్రూపు ఆధ్వర్యాన రూ.24,300ల ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం ఖమ్మం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గణేశ్‌ను మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నారపోగు సుధాకర్, ప్రముఖ న్యాయవాది కరాటే రాము చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ కిన్నెర వెంకటేశ్వర్లు, చావల వెంకటేశ్వరావు, శ్రీను, కన్నారావు, కోటేశ్వరావు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

'త్రివేణి' విద్యార్థులకు అభినందన

ఖమ్మం సహకారనగర్: ఇటీవల నగరంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–14 షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో తమ పాఠశాల విద్యార్థులు ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో బి.విశ్వతేజ, ఎ.వినయ్ నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని త్రివేణి పాఠశాలల డైరెక్టర్లు గొల్లపుడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్‌లు తెలిపారు. శుక్రవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల బాధ్యులు మురళీకృష్ణ, స్వప్న, ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష కేంద్రం సందర్శన

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఇస్రో, శ్రీహరికోట పారిశ్రామిక సందర్శనను శుక్రవారం విజయవంతంగా ముగించారు. ఈ సందర్భంగా సైంటిస్ట్ హనుమంతరావు పురాతన ఉపగ్రహాలు, సౌరఫలకాలు, సౌర తెరచాప అంతరిక్షంలో వాటి స్థానాల సర్దుబాటు చేయడానికి ఉపగ్రహాలపై ఉన్న చిన్న రాకెట్‌లతో సహా ఉపగ్రహాల నమూనాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోపాల్ మాట్లాడుతూ.. పారిశ్రామిక సందర్శనల ద్వారా విద్యార్థులు అత్యాధునిక సాంకేతికతలను తెలుసుకుంటారని చెప్పారు. కాగా, సందర్శించిన విద్యార్థినులను కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు తదితరులు అభినందించారు.

సూర్యతండాలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు..



ట్రాన్స్‌ఫార్మర్ అమర్చిన దృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని సూర్యతండాలో గల విద్యుత్ సమస్యపై అంధకారంలో సూర్యతండా అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. అప్పటి వరకు ఉన్న సింగల్ ఫేస్‌లోని 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం రాత్రి అమర్చారు. దీంతో నిత్యం గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యకు కొంతమేర పరిష్కారం లభించిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఖమ్మంలో అరాచక పాలన కొనసాగుతోంది..

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు



రఘునాథపాలెం: రోటరీనగర్‌లో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం/ఖమ్మంవన్‌టౌన్: అక్రమ మట్టి, ఇసుక దందాలతో పాటు భూకబ్జాలకు పాల్పడుతూ రూ.వేల కోట్లు సంపాదించి మాఫియా గ్యాంగ్‌ను పోషిస్తూ ఖమ్మంలో ఎన్నడూ లేని విధంగా అరాచక పాలన కొనసాగుతోందని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం నగరంలోని 9,10 డివిజన్లు, రఘునాథపాలెంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో, రఘునాథపాలెంలో బోడెపుడి ఫౌండేషన్ నాయకుడు బోడెపుడి రాజా ఆధ్వర్యాన, యువం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యాన పెవిలియన్ గ్రౌండ్ నుంచి నెహ్రూనగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించాక ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. బెదిరింపులు పోలీస్ కేసులతో కాంగ్రెస్ శ్రేణులను భయపెడుతున్నారు. అవినీతి లేని అభివృద్ధి ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల పిలుపునిచ్చారు. పాలేరులో చెల్లని రూపాయి ఖమ్మంలో చెల్లుతుందా అని చెప్పిన బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌ను ఉద్దేశించి నువ్వు చెల్లని రూ.రెండు వేల నోట్‌లాంటోడివని, నేను డాలర్ లాంటోన్ని ఏ దేశం పోయినా చెల్లుతుందని, ఈ జిల్లాలో ఎక్కడ నుండైనా పోటీ చేసి గెలిచే సత్తా తనకుందని, నువ్వు మాత్రం ఖమ్మం దాటితే ఎవరికీ తెలియదని తుమ్మల అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటారని చెప్పారు. దేశ భవిష్యత్ మార్చే శక్తి యువతకు ఉందని, బీఆర్ఎస్ పాలనలో యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఓటుతో తెలంగాణ ఇచ్చిన సోనియా రుణం తీర్చుకోవాలి పేర్కొన్నారు. కాగా, తుమ్మల నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ నగరంలోని 58వ డివిజన్ రాపర్తినగర్‌లో పార్టీ సీనియర్ నాయకుడు శెట్టి రంగారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఎంపీపీ గౌరి, బోయిన లక్ష్మణ్, దుంపటి నగేష్, కార్పొరేటర్లు చావామాధురి నారాయణరావు, జాన్‌బీ నాగులుమీరా, కమర్తపు మురళి, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని బైపాస్‌రోడ్డులో గల తుమ్మల క్యాంపు కార్యాలయంలో 18వ డివిజన్‌కు చెందిన చైతన్య మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు తోటపల్లి పద్మ, సభ్యులు ఊటుకూరు విజయలక్ష్మి, బండ్ల నాగరత్నం, సూర్యపెల్లి ఆదెమ్మ, మీగడ సునీత, మాణిక్యాల రేణుక, ఎస్‌కె.కాజిత్, సందెపు చంద్రకళ, ఎస్.రేణుక, కొమ్మినేని రాజకుమారిలతో పాటు సుమారు 100 మంది తుమ్మల సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

యాదవులను మోసం చేసిన బీఆర్ఎస్..



సమావేశంలో మాట్లాడుతున్న మల్లిబాబుయాదవ్

ఖమ్మంరూరల్: యాదవుల కురుములకు గొర్రెల యూనిట్లను ఇవ్వకుండా మోసం చేసిన బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని యాదవ సంఘం జిల్లా నాయకుడు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ అన్నారు. శుక్రవారం తల్లంపాడులో పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ.. జరిగిన యాదవ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018 ఎన్నికల్లో కేసీఆర్ హామీ ఇచ్చిన గొర్రెల కాపరులకు ప్రమాద బీమా రూ.10లక్షల అమలు, జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాల్, గొర్రెల మార్కెట్ యార్డు నిర్మాణం వంటివి అన్నీ ఉత్త మాటలేనని విమర్శించారు. ఈ ఎన్నికల్లో శ్రీనివాసరెడ్డి గెలుపు కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సోనబోయిన లింగయ్య, సత్యనారాయణ, భారి విజయ్‌కుమార్, వలరాజు, సిలివేరు గణేశ్,ఎన్.సూర్యనారాయణ, మేకల సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు యాదవ, కురుమల ఆత్మీయ సమ్మేళనం..

నేలకొండపల్లి: కూసుమంచి మండల కేంద్రంలో పాలేరు నియోజకవర్గ స్థాయి యాదవ, కురుమల ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహిస్తున్నట్లు గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడి విజయవంతం చేయాలని కోరారు.

దళిత ద్రోహి సీఎం కేసీఆర్...



సమావేశంలో మాట్లాడుతున్న బొందయ్య

ఖమ్మంవన్‌టౌన్: సీఎం కేసీఆర్ దళితులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకుండా దళిత ద్రోహిగా మిగిలారని జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 38లక్షల ఎస్సీ జనాభా ఉంటే 38 వేల కుటుంబాలకు లబ్ధి చేకూర్చకపోగా.. ఎస్సీ సబ్ ప్లాన్‌ను కూడా నీరుగార్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీలకు ఎంతో చేసిందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఏఐసీసీ మీడియా కోఆర్డినేటర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ నాయకులు డీకే శివకుమార్‌పై అవాకులు చవాకులు పేల్చడం మంచి పద్ధతికాదన్నారు. ఈ సమావేశంలో రామిశెట్టి మనోహర్ నాయుడు, కందుల శ్రీను, గాదర్‌బాబు, నాగటి చంద్రం, ఆనందరావు, రాకేశ్, లక్ష్మీనారాయణ,రవి తదితరులు పాల్గొన్నారు.